సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 10 । ఫిబ్రవరి । 2023



వరికి తెగుళ్ల బెడద

యాసంగిలో సాగు చేస్తున్న వరి పంటను పీక పురుగు, లద్దె పురుగు ఆశిస్తోంది. తెగుళ్ల నివారణకు రైతులు పురుగు మందు లు పిచికారీ చేస్తున్నారు. 8లో▸



పాఠశాల ప్రగతికి 'యూడైస్‌ప్లస్‌'

'యూడైస్‌ప్లస్‌'పై హెచ్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలల వివరాలు సక్రమం గా నమోదు చేయాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.7 /16.2

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉండి పగటిపూట ఎండ తీవ్రత అధికమవుతుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో చలి ఉంటుంది. ఉదయం మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్‌

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్‌: షెడ్యూల్డ్‌ కులాలకు చెందిన అభ్యర్థుల నుంచి నాన్‌రెసిడెన్షియల్‌ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి అధికారి సజీవన్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన నిరుద్యోగులకు గ్రూప్‌ 2, 3, 4 పరీక్షలకు శిక్షణ అందిస్తామన్నారు. వంద సీట్లలో రాష్ట్ర ఎస్సీ స్టడీ సర్కిల్‌ ద్వారా 59 మంది అభ్యర్థుల ఎంపిక పూర్తయిందని, మిగిలిన 41 సీట్లకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీలో మెరిట్‌ ద్వారా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3లక్షలకు మించకుండా 2022 జనవరి తర్వాత తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల, నివాస, ఆధార్‌, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు. గతంలో ఉచితంగా కోచింగ్‌ తీసుకున్న వారు అర్హులు కాదని తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్‌ కులాల వసతి గృహ సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

స్థల పరిశీలన



నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వాంకిడి(ఆసిఫాబాద్‌): వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి అదనంగా అందుబాటులోకి తెస్తున్న నూతన భవన నిర్మాణ స్థలాన్ని డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌ నాయక్‌ ఇంజినీరింగ్‌ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి గురువారం పరిశీలించారు. రూ.1.56 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌, సర్పంచ్‌ బండె తుకారాం, ఏఈ స్టీవెన్‌, వైద్యులు వినయ్‌ ఉప్రె, నాయకులు అశోక్‌ మహోల్కర్‌, దీపక్‌ ముండె, జైరాం తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆసిఫాబాద్‌: జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉమెన్‌ డెవలప్‌మెంట్‌ అండ్‌ చైల్డ్‌ వెల్ఫేర్‌ టీఎన్‌జీవో ఫోరం జిల్లా కార్యవర్గ సభ్యులను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం జిల్లా అధ్యక్షురాలిగా పి.కౌసల్య, కార్యదర్శిగా తిరుపతమ్మ, కోశాధికారిగా ఎస్‌.మల్లేశ్‌, ఉపాధ్యక్షుడిగా సలీం, అసోసియేట్‌ అధ్యక్షుడిగా కె.అర్జున్‌, సంయుక్త కార్యదర్శిగా పెంటుబాయితోపాటు ఈసీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా టీఎన్‌జీవో సంఘం ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని శాలువలు, పూలదండలతో సన్మానించారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో నాయకులు మాట్లాడుతూ సంఘ బలోపేతానికి ఉద్యోగులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు కరుణశ్రీ, ప్రచార కార్యదర్శి గోగ మధుకర్‌, అంకూస్‌, రిజ్వాన్‌ తదితరులు పాల్గొన్నారు.

కూలీలకు 'ఉపాధి' పనులు కల్పించాలి



మాట్లాడుతున్న కుటుంబరావు

వాంకిడి(ఆసిఫాబాద్‌): ఉపాధిహామీ పథకంలో ప్రతీ కూలీకి వంద రోజుల పని కల్పించాలని అడిషనల్‌ డీఆర్‌డీవో కుటుంబరావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఈజీఎస్‌ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ముగింపునకు చేరుకున్నాయన్నారు. ఈ మేరకు ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. అలాగే ఆధార్‌ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీవో శివకుమార్‌, ఏపీవో శ్రావణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు(ఫైల్‌)

మారని డైట్‌

- రోగుల మెనూ అమలులో కాంట్రాక్టర్ల చేతివాటం
- హాజరు కొందరు.. నమోదులో రెండింతలు
- రోగుల పొట్టకొట్టి జేబులు నింపుకొంటున్న వైనం
- ఇదీ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి

సాక్షి, ఆసిఫాబాద్‌: ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరే రోగులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే ఆహారం అందిస్తోంది. ఇది జిల్లాలో కొందరి పాలిట కామధేనువుగా మారింది. అందినకాడికి నిధులు కాజేస్తున్నారు. నామమాత్రంగా మెనూ అమలు చేస్తూ.. రోగుల పొట్టకొడుతున్నారు. రోగుల నోళ్లు కట్టేసి నోట్లు నొక్కేస్తున్నారు. హాజరు నమోదులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

హాజరులో తిరకాసు..

జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్‌ ఆసుపత్రికి నిత్యం ఓపీతోపాటు ఇన్‌పేషంట్ల సంఖ్య అధికంగానే ఉంటోంది. ఇదేవిధంగా మిగిలిన ఆసుపత్రుల్లోనూ గర్భిణులు, ఇతర రోగులు చికిత్స పొందుతున్నారు. అయితే కాంట్రాక్టర్లు రోగుల సంఖ్యను తమ ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు ఆసుపత్రి వర్గాల్లోనే వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్లు హాజరు పట్టికలో చూపుతున్న సంఖ్య వాస్తవానికి దూరంగా ఉంటోందని ఆసుపత్రి సిబ్బందే గుసగుసలాడుకుంటున్నారంటే కాంట్రాక్టర్లు ఎంత దండుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు.

కానరాని పర్యవేక్షణ..

మెనూ అమలు, ఆహార నాణ్యత, కాంట్రాక్టర్లు ప్రతిరోజూ ఆహారం అందిస్తున్న రోగుల వివరాలను అధికారులు కచ్చితంగా పర్యవేక్షించాలి. కానీ నాసిరకం ఆహారం అందిస్తున్నా.. మెనూ ప్రకారం అల్పాహారంలో అందించాల్సిన ఇడ్లీ, పొంగల్‌/కిచిడి, కోడిగుడ్డు, కూర, సాంబారు, అరటిపండు ఇవ్వకపోయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఈ నెల 1న 'రోగుల ఆకలి కేకలు' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం రాగా.. జిల్లా పర్యవేక్షణ అధికారి కాంట్రాక్టర్‌కు కేవలం నోటీసులతో సరిపెట్టడం గమనార్హం.

నాణ్యత అధ్వానం..

ప్రతిరోజూ రోగులకు అందించాల్సిన ఆహారం అధ్వానంగా ఉంటోంది. అల్పాహారంలో ఇడ్లీ, ఉప్మా, పొంగల్‌/కిచిడి వడ్డించాలి. కానీ కేవలం ఉప్మాతోనే సరిపెడుతున్నారు. టీ/పాలు అనే ఊసే లేదు. మధ్యాహ్నం, రాత్రి సమయంలో రోగులకు భోజనం లేదా పుల్కాలు ఇవ్వాల్సి ఉంది. భోజనం కూడా మసూరి బియ్యంతో వండిన ఆహారాన్నే వడ్డించాలి. ఇది ఏ ఆసుపత్రిలోనూ అమలు కావడం లేదు. నాణ్యతలేని బియ్యంతో వండి సరఫరా చేస్తున్నారు. అలాగే భోజనంలోకి కూరగాయలతో కూర, సాంబారు, మజ్జిగ సరఫరా చేయాల్సి ఉంది. అలాగే కోడిగుడ్డు, అరటి పండు ఇవ్వాలి. కాంట్రాక్టర్లు మాత్రం నీళ్లచారు, కూరలతో సరిపెడుతున్నారు. రోజుకు రెండేసి చొప్పున ఇవ్వాల్సిన ఉడకబెట్టిన గుడ్లు వారంలో ఒకసారి ఇచ్చి మమ అనిపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఆసిఫాబాద్‌ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రితోపాటు తిర్యాణి (సీహెచ్‌సీ), కాగజ్‌నగర్‌, జైనూర్‌, వాంకిడి, బెజ్జూర్‌, సిర్పూర్‌(యూ) పీహెచ్‌సీల్లో చికిత్స కోసం చేరే రోగులకు ఆహారం పంపిణీ చేస్తున్నారు. ఈ ఆహార పంపిణీ కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మాత్రం రోగులకు చాలీచాలని భోజనం అందిస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సంఖ్యకు.. కాంట్రాక్టర్లు హాజరు పట్టికలో నమోదు చేస్తున్న రోగుల సంఖ్యకు పొంతన ఉండటం లేదు. ఎక్కువ మందికి ఆహారం అందిస్తున్నట్లు తప్పుడు లెక్కలు చూపుతున్నారని ఆసుపత్రి వర్గాలే చెబుతున్నాయి. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటమే కాకుండా.. ప్రతినెలా ఠంఛనుగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తుండటంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నోటీసు ఇచ్చాం

సాక్షి దినపత్రికలో వచ్చిన 'రోగుల ఆకలి కేకలు' కథనంపై విచారణ చేపట్టాం. సదరు కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చాం. రోగులకు నాణ్యమైన ఆహారం పంపిణీ చేయాలని హెచ్చరించాం. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్‌ స్వామి, డీసీహెచ్‌వో, ఆసిఫాబాద్‌

విద్యుత్‌ వినియోగదారులకు
ఊరట

- ఏసీడీ బిల్లులు రద్దు
- సామాన్యులపై తప్పిన భారం
- జిల్లాలో 1,54,878 విద్యుత్‌ కనెక్షన్లు



జిల్లా కేంద్రంలో ఓ వినియోగదారుడికి వచ్చిన ఏసీడీ బిల్లు

ఆసిఫాబాద్‌: విద్యుత్‌ వినియోగదారులకు అడిషనల్‌ కన్జమ్షన్‌ డిపాజిట్‌(ఏసీడీ) పేరుతో వసూలు చేస్తున్న అదనపు బిల్లుల భారం తప్పింది. తాజాగా ఏసీడీ బిల్లు రద్దు చేసినట్లు ట్రాన్స్‌కో అధికారులు ప్రకటించడం జిల్లాలోని విద్యుత్‌ వినియోగదారులకు కాస్త ఊరటనిచ్చింది. గత నెల బిల్లులో ఏసీడీ పేరుతో అదనపు బిల్లు రావడంతో విద్యుత్‌ వినియోగదారులు ఆందోళన చెందారు. కొందరికి ఈ బిల్లు రూ.వేలల్లో ఉండటంతో ఎలా కట్టాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కో నిర్ణయంపై వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదనపు చార్జీలపై ఆందోళన

జిల్లాలో 1,54,878 విద్యుత్‌ కనెక్షన్లు ఉండగా, వీటిలో 1,28,125 గృహాలు, 1,110 కమర్షియల్‌, 10,880 వ్యవసాయ కనెక్షన్లతో పాటు ఇతర విద్యుత్‌ కనెక్షన్లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి ప్రతినెలా సుమారు రూ.4.2 కోట్ల ఆదాయం సమకూరుతోంది. గతంలో కమర్షియల్‌ కనెక్షన్లకే ఏసీడీ బిల్లులు వేయగా, గత కొ న్ని నెలలుగా గృహావసరాల విద్యుత్‌ వినియోగదారుపై కూడా ఏసీడీ పేరుతో చార్జీలు బాదడం జరుగుతోంది. అదనపు విద్యుత్‌ చార్జీలతో షాక్‌కు గురవుతూ ప్రజలు అతలాకుతలం అవుతున్నారు. బిల్లులో ఫిక్స్‌డ్‌ చార్జీ, కస్ట్‌ చార్జీ, ఈడీ పేరుతో వినియోగదారులపై బిల్లులు మోపుతున్నారు. ఒక్కో బిల్లుపై రూ.100 నుంచి రూ.150 వరకు అదనపు చార్జీలు ఉంటున్నాయి. దీంతోపాటు నెలనెలా రీడింగ్‌ తీసుకోవాల్సిన సిబ్బంది నెలదాటిన తర్వాత రీడింగ్‌ తీసుకోవడంతో వినియోగదారులపై భారం పడుతోంది. ఒక్కో సర్వీసుకు రూ.వెయ్యి నుంచి రూ.5 వేల వరకు ఏసీడీ బిల్లులు వేశారు.

ఏసీడీ బిల్లులు రూ.8.43 కోట్లు

జిల్లాలో గతేడాది జూన్‌ నుంచి ఇప్పటివరకు 1,05,034 సర్వీసులకు గాను రూ.8,43,11,000 ఏసీడీ చార్జీలు విధించారు. వీటిలో ఇప్పటి వరకు 5,657 మంది వినియోగదారులు రూ.62 లక్షలు చెల్లించారు. గత నెలలో వచ్చిన ఏసీడీ బిల్లు చెల్లింపునకు ఫిబ్రవరి వరకు గడువు ఇచ్చినప్పటికీ కొంత మంది గత నెలలోనే చెల్లించారు. దీంతో బిల్లులు చెల్లించిన వారి డబ్బులు ఎలా సర్దుబాటు చేస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. నెలవారీ వాడకానికి రూ.వందల్లో బిల్లు వస్తే ఏసీడీ బకాయాల పేరుతో రూ.వేలల్లో వస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ నుంచి అదనపు బిల్లులు వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఎట్టకేలకు ఏసీడీ రద్దు చేయడంతో ప్రజలపై భారం తప్పింది.

ఏసీడీ రద్దయింది

వినియోగదారులకు ఏసీడీ బిల్లులను ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటికే బిల్లులు చెల్లించిన వారికి ఎలా సర్దుబాటు చెయ్యాలనే దానిపై నిర్ణయం తీసుకోలేదు. త్వరలో దీనిపై కూడా స్పష్టత వస్తుంది.

– వాసుదేవ్‌, ట్రాన్స్‌కో ఎస్‌ఈ

నేడు 'తొలిమెట్టు'పై సమీక్ష సమావేశం

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌ రైతువేదికలో శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలతో తొలిమెట్టు కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఈవో అశోక్‌ తెలిపారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌ హాజరవుతారని పేర్కొన్నారు. హెచ్‌ఎంలు, ఎంఈవోలు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

కౌన్సెలింగ్‌ నిర్వహించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

రెబ్బెన(ఆసిఫాబాద్‌): బెల్లంపల్లి ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్న క్లరికల్‌ సిబ్బంది కౌన్సెలింగ్‌ వెంటనే నిర్వహించాలని క్లర్కులు డిమాండ్‌ చేశారు. గురువారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం గోలేటిలోని జీఎం కార్యాలయంలో జీఎం దేవేందర్‌తోపాటు గోలేటి సీహెచ్‌పీ, ఖైరిగూడ ఓసీపీల్లో ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా కుటుంబానికి దూరంగా ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. సొంత ప్రాంతానికి వెళ్లేందుకు కౌన్సెలింగ్‌ నిర్వహించాలని పలుమార్లు విన్నవించినా యాజమాన్యం నుంచి స్పందన లేదని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వుల ద్వారా నియామకమైన 22 మందిని జూనియర్‌ అసిస్టెంట్లుగా తాత్కాలికంగా సొంత ఏరియాల్లో పోస్టింగ్‌లు ఇచ్చిన యాజమాన్యం, 2022లో చేపట్టిన అంతర్గత నియామకాల ద్వారా కొత్తగా 141 మందికి జూనియర్‌ అసిస్టెంట్లుగా పోస్టింగ్స్‌ ఇవ్వడానికి యాజమాన్యం సిద్ధమైందన్నారు. దీంతో ఏళ్లుగా ఇదే ఏరియాలో పనిచేస్తున్న తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం 162 పోస్టులను ఖాళీగా చూపుతూ కౌన్సెలింగ్‌ నిర్వహించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఫిట్‌ సెక్రటరీ రవీందర్‌, జిల్లాల రవి, రామకృష్ణ, సత్యనారాయణ, రవికుమార్‌, సురేష్‌రెడ్డి, రాము, రజినీకుమార్‌, గణేశ్‌, నరేశ్‌, రాజ్‌కిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్‌

- జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేశ్‌

తిర్యాణి(ఆసిఫాబాద్‌): బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి మహేశ్‌ అన్నారు. బాల్యవివాహాలతో భవిష్యత్తులో జరిగే అనర్థాలపై గురువారం తిర్యాణి మండలం ఉల్లిపిట్ట గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ కుమారుడితో సమానంగా కుమార్తెను పెంచాలన్నారు. మహిళలు అక్షరాస్యత సాధించడం ద్వారానే సమాజ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే సమాచారం అందించాలని కోరారు. వైస్‌ ఎంపీపీ కోవ పార్వతి, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ విజయ, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు యూడైస్‌ ప్లస్‌ కీలకం



మాట్లాడుతున్న ఎస్‌వో రాథోడ్‌ సుభాశ్‌

కెరమెరి(ఆసిఫాబాద్‌): పాఠశాలల ఉన్నతికి యూడైస్‌ ప్లస్‌ కీలకమని జిల్లా సెక్టోరియల్‌ అధికారులు రాథోడ్‌ సుభాష్‌, సత్యనారాయణ మూర్తి, స్వర్ణలత అన్నారు. కెరమెరి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో గురువారం కెరమెరి, జైనూర్‌, సిర్పూర్‌(యూ), లింగాపూర్‌ మండలాల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి యుడైస్‌ ఎంతో ముఖ్యమన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాల లాగిన్‌ నుంచి ప్రొఫార్మాను డౌన్‌లోడ్‌ చేసుకుని తప్పులు లేకుండా పూరించాలని సూచించారు. ఈ ప్రొఫార్మాను 11 తేదీ వరకు కాంప్లెక్స్‌, 12న ఎమ్మార్సీ, 13న డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు పూరించిన ప్రొఫార్మాను కాంప్లెక్స్‌ హెచ్‌ఎంలు, ఎమ్మార్సీ సిబ్బంది కోడీకరించాలన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌వోలు సుభాష్‌, స్వర్ణలతను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో సుధాకర్‌, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్‌, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్కార్‌ బడికి కొత్తరూపు

- పీఎంశ్రీ యోజన కింద ఒక్కో పాఠశాలకు రూ.2కోట్ల నిధులు
- జిల్లాలో 30 స్కూళ్లకు అవకాశం
- ఇప్పటికే ప్రతిపాదనలు పంపించిన జిల్లా విద్యాశాఖ అధికారులు



ఆసిఫాబాద్‌ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల

ఆసిఫాబాద్‌రూరల్‌: సర్కారు బడులకు మహర్దశ పట్టనుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టింది. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఇదే తరహాలో కేంద్ర ప్రభుత్వం సర్కారు స్కూళ్లను కార్పొరేట్‌ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో పీఎంశ్రీ యోజనకు శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద జిల్లాలో 51 పాఠశాలలను విద్యాశాఖ అధికారులు ఎంపిక చేసిన ప్రతిపాదనలు పంపించారు. ఇందులో ప్రతీ మండలానికి రెండు చొప్పున 30 స్కూళ్లకు అవకాశం లభించనుంది. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన పాఠశాలలకు 2023– 24 విద్యాసంవత్సరం నుంచి 2027–28 వరకు ఒక్కో దానికి రూ.2కోట్ల నిధులు కేటాయించనున్నారు.

ప్రతిపాదనలు పంపించిన అధికారులు..

జిల్లాలో మొత్తం 1,263 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో ఉన్నత పాఠశాలలు 168, ప్రాథమికోన్నత 186, ప్రాథమిక పాఠశాలలు 909 ఉన్నాయి. ఇందులో పీఎంశ్రీ యోజన కింద 51 పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఆసిఫాబాద్‌ మండలం నుంచి 9, కాగజ్‌నగర్‌ నుంచి 12, చింతలమానెపల్లి 3, కెరమెరి 3, దహెగాం 3, బెజ్జూర్‌ 3, పెంచికల్‌పేట్‌ 3, రెబ్బెన 3, వాంకిడి 3, జైనూర్‌ 2, కౌటాల 4, తిర్యాణి 1, సిర్పూర్‌(టి) నుంచి 2 పాఠశాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆన్‌లైన్‌ ప్రక్రియ పూర్తిచేసి రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. విద్యాశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో స్క్రూట్నీ చేసిన తర్వాత ప్రతీ మండలానికి రెండు పాఠశాలను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ లెక్కన జిల్లాలో 15 మండలాల్లో 30 పాఠశాలలకు పీఎం శ్రీ యోజనకు ఎంపికయ్యేందుకు ఆస్కారం ఉంది. ఎంపిక చేసిన పాఠశాలల అభివృద్ధికి ఐదేళ్లపాటు రూ.2 కోట్లు ఖర్చు చేయనున్నారు.

చేపట్టే పనులు..

పీఎంశ్రీ యోజన కింద ఎంపికైన పాఠశాలలను జియో ట్యాగింగ్‌ చేసి బడుల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. నిపుణుల కమిటీ ఆదేశాల మేరకు విడతల వారీగా నిధులు మంజూరు చేయనున్నారు. నిబంధనలకు అనుగుణంగా ప్రతీ మండలానికి ఒక ప్రాథమిక పాఠశాల, మరో ఉన్నత పాఠశాలను ఎంపిక చేస్తారు. విద్యా ప్రమాణాలను మెరుగు పర్చేందుకు సాంకేతిక సాయం తీసుకుంటారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు చర్యలు చేపడతారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి స్వయంగా సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, ఆకుకూరలు బడి ఆవరణలోనే సాగు చేయాల్సి ఉంటుంది. స్కూళ్లను ప్లాస్టిక్‌ వినియోగ రహితంగా తీర్చిదిద్దాలి. వేస్ట్‌ మేనేజ్‌మెంట్‌, నీటి నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. బడిలో ఎల్‌ఈడీ బల్బులు, న్యూట్రిషన్‌ గార్డెన్‌, శుద్ధి చేసిన తాగునీరు, సోలార్‌ విద్యుత్‌ తదితర సదుపాయాలు కల్పిస్తారు. నిధుల్లో 60 శాతం కేంద్రం ప్రభుత్వం, మరో 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

త్వరలో తుది జాబితా



జిల్లాలో 30 పాఠశాలలు పీఎంశ్రీ యోజనకు ఎంపికయ్యే అవకాశం ఉంది. ఆయా పాఠశాలల్లో మెరుగు పడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. ఈ పథకానికి అర్హత సాధించిన పాఠశాలలకు సంబంధించి తుది జాబితా త్వరలోనే రానుంది.

– అశోక్‌, జిల్లా విద్యాశాఖ అధికారి

విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి

- అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్‌ బాజ్‌పాయ్‌
- ముగిసిన క్రీడాపోటీలు



బహుమతి ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్‌ బాజ్‌పాయ్‌, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో ముందుండాలని అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఎంపీపీ స్పోర్ట్స్‌ మీట్‌ మండల స్థాయి క్రీడాపోటీలు గురువారంతో ముగిశాయి. విజేతలకు డీఈవో అశోక్‌, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించిన పోటీలతో విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడానైపుణ్యం బహిర్గతమైందన్నారు. అలాగే క్రీడలతో పోటీతత్వం, స్నేహభావం పెరుగుతుందన్నారు. అనంతరం ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మనుకు కుమార్‌, ఎంపీడీవో శశికళ, సింగిల్‌ విండో చైర్మన్‌ అలీబిన్‌, పీడీలు, పీఈటీలు తిరుపతి, రాకేశ్‌, మధుసూదన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నలుగురు బీట్ అధికారులకు పదోన్నతి

జన్నారం: జన్నారం అటవీ డివిజన్‌లో విధులు నిర్వర్తిస్తున్న నలుగురు బీట్ అధికారులకు సెక్షన్ ఆఫీసర్లుగా పదోన్నతులు లభించాయి. కవ్వాల్ బీట్ అధికారి కృష్ణ, దొంగపల్లి బీట్ అధికారి శంకర్, చింతపల్లి బీట్ అధికారి అర్చన, మల్యాల బీట్ అధికారి మీర్జా జియా ఉల్ల భేగ్‌లకు పదోన్నతి కల్పిస్తూ చీఫ్ కన్జర్వేటర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రారంభమైన డిగ్రీ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: కాకతీయ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కేయూ పరీక్షల విభాగం అడిషనల్ కంట్రోలర్ నరేందర్ తెలిపారు. ఈ పరీక్షలు ఈ నెల 22 వ తేది వరకు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని, ఉమ్మడి జిల్లా పరిధిలో 50 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

రేపు ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో తొమ్మిదో తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.చక్రపాణి తెలిపారు. 5 సీట్ల కోసం 994 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగజ్‌నగర్ త్రిశూల్ పహాడ్ జవహర్ నవో దయ విద్యాలయంతో పాటు సెయింట్ క్లారెట్ స్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, 11.15 గంటల తర్వాత లోనికి అనుమతించమని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి ఆన్‌లైన్ నుంచి హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకొని రావాలని, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమన్నారు.

దాడి కేసు నమోదు

శ్రీరాంపూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని ఆర్కే 6 లక్ష్మీనగర్‌కు చెందిన రోజారాణిపై దాడికి పాల్పడిన అదే ప్రాంతానికి చెందిన రాదారపు రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మానస ఒక ప్రకటనలో తెలిపారు. రోజారాణి భర్త భాస్కర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని కర్ణమామిడి గ్రామానికి చెందిన మామిడిపెల్లి సంతోష(39) కాలిన గాయాలతో చికిత్స పొందుతూ మృతి చెందింది. హాజీపూర్ ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కర్ణమామిడికి చెందిన మామిడిపెల్లి సంతోష 15 సంవత్సరాలుగా మతిస్థిమితం కోల్పోయింది. ఈ నెల 2న రాత్రి దోమల నివారణకు పేపర్ వెలిగించే క్రమంలో తన దుస్తులకు నిప్పంటించుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి బాబాయ్ కలమడుగు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

రెడ్డికాలనీలో చోరీ

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో నివాసం ఉంటున్న కుర్ర జయదేవ్ బాబు ఇంట్లో చో రీ జరిగినట్లు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. జయదేవ్‌బాబు సతీమణి అనారోగ్యం బారిన పడడంతో చికిత్సకోసం ఈ నెల 2న హైదరాబాద్‌కు తీసుకెళ్లా రు. గురువారం ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న రూ.5 లక్షల విలువైన 25 తులాల బంగారు ఆ భరణాలు అపహరణకు గురయ్యాయని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసి ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రిటైర్డ్ కార్మికుల తిప్పలు



గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం

- డాటా ఎంట్రీలో పొరపాట్లు
- పలువురికి నిలిచిపోయిన పెన్షన్లు
- సీపీఆర్‌ఎంఎస్ కార్డుల జారీలోనూ జాప్యం

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులు తమకు రావాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో రిటైర్డ్ కార్మికులది ఇదే పరిస్థితి. రిటైర్డ్ అయిన తర్వాత కార్మికులకు వైద్య చికిత్సల కోసం కంట్రీబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీం కింద మెడికల్ కార్డులను జారీ చేస్తారు. సర్వీసులో ఉన్నప్పుడే దీని కోసం ముందుగానే కార్మికుడి వద్ద నుంచి రూ.40 వేలు రికవరీ చేసి రిటైర్డ్ అయిన తర్వాత భార్యాభర్తలకు మెడికల్ కార్డులు జారీ చేస్తారు. అయితే రిటైర్డ్ కాకముందే డబ్బులు రికవరీ అయినా కూడా ఉద్యోగ విరమణ పొందిన వెంటనే కార్డులు మాత్రం జారీ కావడం లేదు. ఇందుకు కనీసం రెండు నుంచి మూడు నెలల సమయం పడుతోంది. మూడు నెలల్లోగా కార్డు తీసుకోవాలని కంపనీ నిబంధనలు ఉన్నా చివరి సమయంలో కార్డులు అందుతున్నాయని రిటైర్డ్ కార్మికులు పేర్కొంటున్నారు. ఈ మధ్యకాలంలో ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే దూరప్రాంతాల్లో ఉన్న వారు ఆస్పత్రిలో చేరితే మెడికల్ కార్డులేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీని కోసం ప్రత్యేకంగా జీఎం కార్యాలయానికి వెళ్లి లెటర్ రాయించుకుని రావాల్సిన పరిస్థితి ఉందని రిటైర్డ్ కార్మికులు వాపోతున్నారు. రిటైర్డ్ అయిన మరుసటి రోజే కార్డు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సెటిల్‌మెంట్ చేస్తున్నాం

రిటైర్డ్ కార్మికులు కంపెనీ కోరిన పత్రాలను సరైన సమయంలో అందిస్తే సెటిల్‌మెంట్స్ అన్ని వెంటనే జరుగుతున్నాయి. కొన్ని కోర్టు కేసుల్లో ఉన్న వాటికే ఆలస్యం అవుతున్నాయి. అంతే తప్ప ఎక్కడా జాప్యం లేకుండా త్వరగా సెటిల్‌మెంట్ చేస్తున్నాం.

– గోవిందరాజు, డీజీఎం(పర్సనల్), శ్రీరాంపూర్

12 వేల మందికి ఆగిన పెన్షన్..

సింగరేణి వ్యాప్తంగా సుమారు 12 వేల మంది రిటైర్డ్ కార్మికులకు ఈ ఏడాది జనవరి మాసానికి సంబంధించిన పెన్షన్లు నిలిచిపోయాయి. రిటైర్డ్ కార్మికులు తమ జీవన్ ప్రమాణ్(లైవ్ సర్టిఫికెట్)లను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే క్రమంలో జరిగిన సాంకేతిక తప్పిదాలతో పెన్షన్లు నిలిచిపోయాయని తెలిసింది. ఏటా డిసెంబర్ చివరి నాటికి లైవ్ పత్రాలను మీసేవ కేంద్రాల్లో సమర్పించాల్సి ఉంటుంది. కొంతమంది సెంటర్ నిర్వాహకులు పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేసే క్రమంలో చేసిన తప్పిదాల కారణంగా చాలా మంది కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. ఇది సింగరేణి పరిధిలో ఉండదు కాబట్టి కార్మికులు గోదావరిఖనిలోని సీఎంపీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. గ్రాట్యుటీ, సీఎంపీఎఫ్ చెల్లింపుల్లో కూడా అన్ని ఏరియాల్లో జాప్యం జరుగుతోందని రిటైర్డ్ కార్మికులు పేర్కొంటున్నారు. కారుణ్య ఉద్యోగాల పేరుతో ఇటీవల మెడికల్ ఇన్వాలిడేషన్ కింద ఎక్కువ మంది కార్మికులు రిటైర్డ్ అవుతుండటంతో వారు తమ క్వార్టర్‌ను కంపెనీకి అప్పగించడం లేదు. క్వార్టర్ అప్పగించకుంటే గ్రాట్యుటీ చెల్లించడం జరగదని అధికారులు పేర్కొంటున్నారు. డిపెండెంట్ ఉద్యోగంలో చేరాక అప్పుడు వారుంటున్న క్వార్టర్ డిపెండెంట్‌కు అలాట్ చేసిన తర్వాతే రిటైర్డ్ ఉద్యోగి వెకేట్ చేయడం, గ్రాట్యుటీ చెల్లించడం జరుగుతుంది. దీనికి కొన్ని నెలల సమయం పడుతుంది. ఈ నిబంధనను సరళతరం చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే మొన్నటి వరకు దీపావళి బోనస్, లాభాల బోనస్ చెల్లింపులు మందమర్రి వంటి ఏరియాలో ఇంకా మొదలు కాలేదు.

వరికి తెగుళ్ల బెడద


పీక పురుగు ఆశించిన వరి పంట

- పంటను ఆశిస్తున్న పీక, లద్దెపురుగులు
- ఆందోళనలో అన్నదాత

చెన్నూర్‌రూరల్: ఈ ఏడాది యాసంగి సీజన్‌లో వరి నాట్లు ఇంకా కొనసాగుతున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 98,521 ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేస్తున్నట్లు అధికారులు అంచనా వేశారు. చెన్నూర్ మండలంలో 13 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నారు. డిసెంబర్ చివరి వారం నుంచి జనవరి మాసంలో నాటువేసిన పంటలను పీక పురుగు, లద్దె పురుగు ఆశించింది. దీంతో రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు.

తెగుళ్లు.. లక్షణాలు

లద్దె పురుగు సోకితే వరి ఆకుల చివరలను కొరికి ఆకుల అంచుల వెంబడి కత్తిరిస్తూ మొక్కల మొదళ్లను కూడా తింటుంది. పొలంలో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు వీటి ఉధృతి తక్కువగా ఉంటుంది. వరి మొక్కలు ఎర్రబడటం, ఆకులపై తుప్పు వర్ణపు మచ్చలు కలిగి క్రమేపి మొక్కలు చనిపోతాయి. పిలకలు వేసే దశలో వరి ఆకులపై నూలు కండె ఆకారంలో మచ్చలు ఏర్పడి క్రమేణా అనుకూల పరిస్థితుల లో ఇవి పెద్దగా మారుతాయి. మచ్చల చివర్లో మొనతేలి ఉంటుంది. దీంతో ఆకులు పాక్షికంగా లేదా మొత్తం ఎండిపోతాయి. దూరం నుంచి చూస్తే పంట తగులబడినట్లు కనిపిస్తుంది.

నివారణ చర్యలు చేపట్టాలి



లద్దె పురుగు నివారణ కోసం ఫ్లూబెండియామైడ్ 0.1ఎంఎల్ లేదా క్లోరంట్రానిలిప్రోల్ 0.3ఎంఎల్ లీటరు నీటికి కలిపి సాయంత్ర పిచికారీ చేయాలి. పొలంలో పూర్తిగా నీళ్లు పెట్టి పురుగు మందు పిచికారి చేస్తే మంచిది. దీని నివారణకు పొలంలో నీరు నిల్వ ఉంచుతూ తీసివేస్తూ కొత్త నీరు పెట్టడం చేయాలి. తద్వారా లవణాల సాంద్రత పెరగకుండా నిరోధించవచ్చు. సూక్ష్మ పోషకాలైన ఫార్ములా–4, చిలామెన్‌వంటి మందులు పిచికారీ చేయాలి.

– కవిత, ఏవో, చెన్నూర్

కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. గురువారం ఆర్కే 6 గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ వద్ద వందలాది ఎకరాల భూములు నిరుపయోగంగా ఉన్నాయని, వీటిలో కార్మికులకు రెండు గుంటల చొప్పున ఇళ్ల స్థలం ఇవ్వాలని, కోలిండియాలో మాదిరిగా పెర్క్స్‌పై ఐటీని కంపనీ రీయింబర్స్‌మెంట్ చేయాలని, కార్మికులు తీసుకోని క్వార్టర్లు ఉంటే కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. లేదంటే కార్మికుల మనుగడే ప్రశ్నార్థకంగా మారనుందన్నారు. గనుల్లో ప్రమాదాలు జరిగితే ఉన్నతాధికారుల మన్ననల కోసం ప్రమాదాల సంఖ్యను తక్కువగా చూపుతున్నారన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతీ ప్రమాదాన్ని రిపోర్టుగా రాయాలన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు గొర్రె నర్సయ్య, సంఘం సదానందం, తోట మహేశ్, కారుకూరి నగేశ్, చిలుక రాంచందర్, బాలసారి లక్ష్మణ్, క్రాంతికుమార్, దాసరి రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బొగ్గు బ్లాకులను అడ్డుకుంటాం


కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): కేంద్ర ప్రభుత్వం సింగరేణిలో ప్రైవేటుపరం చేసిన కోయగూడెం బొగ్గుబ్లాకు పనులు అడ్డుకుంటామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జె.శంకర్‌రావు అన్నారు. గురువారం ఎస్సార్పీ 1 గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వీటిని అడ్డుకోకుంటే ముందుముందు సింగరేణిలో మరిన్ని బొగ్గు బ్లాకులు ప్రైవేటుపరం అవుతాయన్నారు. రాష్ట్ర సర్కార్ వీటిని అడ్డుకోవడంలో విఫలమైందన్నారు. కార్మికులు పోరాడితేనే సంస్థ మనుగడ సాధిస్తుందన్నారు. ఈ సందర్భంగా గనిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిసే స్వామి, ఏరియా సెక్రటరీ సమ్ము రాజయ్య, నాయకులు వెంకటేశ్, కుమారస్వామి, జీవన్‌రావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దేశం గర్వించేస్థాయికి ఎదగాలి


వీఆర్‌కే ప్రసాద్‌కు పూలబొకే అందిస్తున్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల స్థాయిలోనే జీవిత లక్ష్యాలు ఏర్పర్చుకుని దేశం గర్వించేస్థాయికి ఎదగాలని ఇండియన్ ఆర్మీ విశ్రాంత కల్నల్, ఇక్ఫాయ్ యూనివర్శిటీ ఛాన్స్‌లర్ డా.వీఆర్‌కే ప్రసాద్ అన్నారు. 1964లో మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎస్‌సీ చదివిన వీఆర్‌కే ప్రసాద్ గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన కాగిత పుష్పాలను ఆయనకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలే నా జీవితానికి స్ఫూర్తి అన్నారు. పౌరులు దేశభక్తి, బాధ్యత, విలువలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం ఆసూరి వేణుగోపాల్, ఉపాధ్యాయులు గుండేటి యోగేశ్వర్, గోలి మనోహర్, శ్రీనివాస్, మహేష్, వర్మ, నాగరాజు, చారి, సునీతాదేవి, రంగరాణి, నీల్ కమల్, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగలో సస్యరక్షణ చర్యలు పాటించాలి


పంటలు పరిశీలిస్తున్న అధికారులు

జైపూర్(చెన్నూర్): వేరుశనగ సాగు చేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు పాటించడం వలన అధిక లాభాలు ఆర్జించవచ్చని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజేశ్వర్‌నాయక్ తెలిపారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా గురువారం జైపూర్ మండలంలోని పౌనూర్, గోపాల్‌పూర్, గోదారిపల్లి గ్రామాల్లో పర్యటించి వేరుశనగ పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వేరుశనగ పంటలో తిక్కాకు మచ్చ తెగులును గుర్తించామని, దీని నివారణకు లీటరు నీటికి 1మిల్లీ లీటర్ చొప్పున టెబ్యూకోనజోల్ అనే శిలింధ్రనాశిని పిచికారీ చేయాలన్నారు. గూడలు దిగే సమయంలో శాస్త్రవేత్తలు సూచించిన మేరకు జిప్సం వాడిన రైతు క్షేత్రాలలో గింజ పరిమాణం, నాణ్యత రంగు మెరుగ్గా ఉందన్నారు. నూనె శాతం పెరగడంతో పాటు కోత సమయం కూడా తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఏడీఏ బాపు, శాస్త్రవేత్తలు డాక్టర్ శివకృష్ణ, నాగరాజు, జైపూర్ మండల వ్యవసాయ శాఖ అధికారి మార్క్‌గ్లాస్టన్, స్థానిక సర్పంచ్ సారయ్య, ఉపసర్పంచ్ స్వామి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిరక్షించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాండూర్(బెల్లంపల్లి): ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ కాంగ్రెస్, సీపీఐ నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తాండూర్, రేచిని, కాసిపేట శివారుల్లోని ప్రభుత్వ భూములు ఇప్పటికే కబ్జా అయ్యాయన్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను రెవెన్యూ ఆధీనంలోకి తీసుకుని వాటికి పకడ్బందీగా హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. లేని పక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరం దామోదర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాపర్తి సుభాష్, సీపీఐ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, మాజీ జెడ్పీటీసీ బండి పోశం, నాయకులు అనిల్, అలీ, షేక్ హైమద్, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే డీజిల్ ఇప్పిస్తానని మోసం

సిర్పూర్(టి): తక్కువ ధరకే డీజిల్ ఇప్పిస్తానని చెప్పి మోసానికి పాల్పడ్డాడు ఓ ఘరానా దొంగ. సిర్పూర్(టి) ఎస్సై ఢీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేంపల్లి గ్రామానికి చెందిన ఆడె రాజశేఖర్ ఈ నెల 3న తన ట్రాక్టరుతో మెయిన్‌రోడ్ పక్కనే ఉన్న చేనులో దున్నుతుండగా గుర్తు తెలియని వ్యక్తి వచ్చి తక్కువ ధరకు డీజిల్ ఇప్పిస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన రాజశేఖర్ అతన్ని తీసుకుని ఇంటికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న రూ.12వేల నగదు తీసుకుని తన తమ్ముడితో కలిసి మోటార్ సైకిల్ (టీఎస్ 20 6724)పై బయలుదేరారు. వేంపల్లి శివారులో రాజశేఖర్ వాహనం దిగి తన తమ్ముడిని డీజిల్ కొరకు సిర్పూర్(టి) వైపు పంపించాడు. సిర్పూర్(టి)లోని పెట్రోల్ పంపు వద్దకు వెళ్లిన తర్వాత ఇక్కడి వరకే వెళ్లి వస్తానని చెప్పి నగదుతో పాటు బైక్ వేసుకుని ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి

ఇచ్చోడ(బోథ్): అతిగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్ తెలిపారు. బజార్‌హత్నూర్ మండలంలోని చందునాయక్ తాండకు చెందిన కాత్లె చంద్రభాన్ (50) మద్యానికి బానిసై ఆర్నెళ్లుగా ఇంటికి వెళ్లకుండా మండల కేంద్రంలోనే తిరుగుతున్నాడు. రెండు రోజుల క్రితం అతిగా మద్యం సేవించి పోస్టాఫీసు ముందున్న ఓ భవనంపైకి ఎక్కి పడుకున్నాడు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య


రాజం మృతదేహం

తిర్యాణి(ఆసిఫాబాద్): మద్యానికి బానిసై ఒ కరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం కొత్తగూడలో చోటు చేసుకుంది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం మొర్రిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తగూడకు చెందిన వెల్మల రాజం(43) నిత్యం మద్యం సేవిస్తూ కుటుంబాన్ని పట్టించుకోకుండా తి రుగుతుండేవాడు. బుధవారం గ్రామ సమీ పంలోని జొన్న చేనుకు కాపలా ఉంటానని వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో అత ని భార్య భీమక్క చేను వైపుకు వెళ్తుండగా దా రిలో గుర్తు తెలియని పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గమనించింది. స్థానికుల సాయంతో మంచిర్యాలలో ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అద్దె బస్సులపై 10శాతం రాయితీ

- జూన్ 30 వరకు వర్తింపు
- ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి


ఆదిలాబాద్: అద్దె బస్సులపై 10శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కే.జానీరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం అన్ని రకాల సర్వీసులపై ఈ రాయితీ వర్తిస్తుందని తెలిపారు. గతంలో కార్తీక మాసం, వనభోజనాలు, శబరిమల అయ్యప్ప దర్శనం సందర్భంగా ఈ రాయితీ కల్పించగా గత ఏడాది డిసెంబర్ 31తో గడువు ముగిసిందని పేర్కొన్నారు. ప్రస్తుతం శుభకార్యాల సీజన్ నేపథ్యంలో ప్రజలు ఇబ్బందులు పడొద్దనే ఉద్దేశంతో ఈ ఏడాది జూన్ 30వరకు రాయితీని పునరుద్ధరించినట్లు తెలిపారు. ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే తక్కువ ధరకే ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తోందని, ఎలాంటి నగదు డిపాజిట్ లేకుండానే ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందస్తు బుకింగ్ కోసం www.tsrtconline.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని, వివరాలకు స్థానిక డిపో మేనేజర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రియుడి ఇంటిఎదుట బైఠాయింపు


ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన యువతి

తాండూర్(బెల్లంపల్లి): తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించిన ప్రియుడి ఇంటి ఎదుట ఓ యువతి బైఠాయించిన ఘటన గురువారం మండలంలోని అచ్చులాపూర్‌లో చోటు చేసుకుంది. అచ్చులాపూర్ గ్రామానికి చెందిన అడ్వాల కృష్ణ , తేండ్ర స్వప్న కాలేజీలో చదువుకున్నప్పటి నుంచి స్నేహితులు. వారి స్నేహం కాస్తా ప్రేమగా మారింది. తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి స్వప్నను నమ్మించిన కృష్ణ తన అవసరాలు తీర్చుకున్నాడు. పెళ్లికి ఇరువురి పెద్దలు అంగీకరించలేదు. సదరు యువతికి వేరే వ్యక్తితో వివాహం జరిపించారు. ఆ తర్వాత కూడా కృష్ణ తరచూ ఫోన్ చేసి భర్తతో కాపురం చేయవద్దని, తాను పెళ్లి చేసుకుంటానంటే మరొకరిని ఎలా పెళ్లి చేసుకున్నావని మానసికంగా వేధించడం ప్రారంభించాడు. తనవద్ద ఉన్న ఫొటోలు, వీడియోలు బయటపెడ్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. భర్తకు విడాకులిస్తే పెళ్లి చేసుకుంటానని నమ్మ బలకడంతో విడాకులు ఇచ్చింది. ఆతర్వాత కృష్ణ మరో అమ్మాయిని వివాహం చేసుకోవడంతో మూడు రోజుల క్రితం తాండూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇప్పటి వరకూ పోలీసులు అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించింది. ఆమెకు పలువురు మహిళలు సంఘీభావం ప్రకటించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.

క్రీడా ప్రాంగణంలో సామగ్రి చోరీ


దొంగలు కోసుకెళ్లగా మిగిలిన పైపులు

మందమర్రిరూరల్(చెన్నూర్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాలకు కాపలాదారులు లేకపోవడంతో అందులోని సామగ్రి చోరీకి గురవుతోంది. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నాలువ వార్డు ప్రభుత్వ జూనియర్ కళాశాల (సారంగపల్లి రోడ్డు)పక్కన సుమారు ఎకరా విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసిన అధికారులు అందులో వ్యాయామానికి సంబంధించిన పైపులను అమర్చారు. ప్రారంభం ఆర్భాటంగా జరిగినా తర్వాత దాని నిర్వహణ మర్చిపోవడంతో పైపులను దొంగలు కోసుకెళ్లారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాల వద్ద నిఘా ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ రవాణా వాహనాలకు జరిమానా


పోలీస్‌స్టేషన్ ఆవరణలో పట్టుకున్న టిప్పర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలో జాతీయ రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమదారిలో కంకర రవాణా సాగిస్తున్న రెండు టిప్పర్లను గురువారం మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచగా, ఒక్కో టిప్పర్‌కు రూ. 9,800చొప్పున రెండు వాహనాలకు రూ.19,600జరిమానా విధించినట్లు మైనింగ్ ఏడీ బాలు తెలిపారు.

కంది పంట దగ్ధం

ముధోల్: మండలంలోని ఎడ్‌బిడ్‌లో నల్ల విఠల్‌రెడ్డికి చెందిన కంది కుప్ప బుధవారం రాత్రి దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఏడాది రెండెకరాలు కౌలుకు తీసుకుని అందులో కంది పంట వేశాడు. పంట కోతకు రావడంతో కోసి పంటచేనులోనే కుప్పగా వేశాడు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కుప్పకు నిప్పంటించారు. సుమారు పది క్వింటాళ్ల వరకు పంట దగ్ధమైందని, సుమారు రూ.90వేల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధిత రైతు వాపోతున్నాడు.

వివాహిత అదృశ్యం

సారంగపూర్(నిర్మల్): మండంలోని జామ్ గ్రామానికి చెందిన జంగం యమున అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండలంలోని జామ్ గ్రామానికి చెందిన యమునకు ఎనిమిదేళ్ల క్రితం కామారెడ్డిలోని బ్రాహ్మణపల్లికి చెందిన జంగం అనిల్‌తో వివాహమైంది. భర్త అనిల్‌తో గొడవపడి నాలుగు నెలల క్రితం పుట్టింటికి వచ్చేసింది. ఇటీవల తన తండ్రి చేయి విరగడంతో ఆయుర్వేద చికిత్స నిమిత్తం గురువారం మామడ మండల కేంద్రంలో వైద్యం చేయించుకునేందుకు వెళ్లాడు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన అల్లమయ్యకు తన కుమార్తె కనిపించకపోవడంతో సమీప బంధువుల ఇళ్లలో వెతికాడు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.